
సాక్షి
వరంగల్
గురువారం । 13 । ఏప్రిల్ । 2023



కోల్‌బెల్ట్‌పై పార్టీల గురి

త్వరలో జరుగబోయే సింగరేణి ఎన్నికలను ప్రతిపక్షాలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. ఈ ఎన్నికలు అసెంబ్లీ ఎన్నికలకు ప్రీఫైనల్‌గా రాజకీయ పార్టీలు భావిస్తున్నాయి. - 8లో▸



దూరవిద్య పీజీ పరీక్షలు షురూ

కేయూ దూరవిద్య పీజీ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు 26 మంది విద్యార్థులు డీబార్ అయ్యారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
40.5°/24.0°

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.



న్యూస్‌రీల్

కేంద్రంపై ఆరోపణలు అర్థరహితం

- జీజేపీ రాష్ట్ర నాయకుడు రేవూరి ప్రకాశ్‌రెడ్డి



నెక్కొండ: తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదని సీఎంతో సహా మంత్రుల ఆరోపణలు అర్థరహితమని బీజేపీ రాష్ట్ర నాయకుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం మాజీ ఎంపీపీ గటిక అజయ్‌కుమార్ అధ్యక్షతన పార్టీ బూత్ స్థాయి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రేవూరి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ... రాష్ట్రంలో అవినీతి అక్రమాలు, ప్రశ్నపత్రాల లీకేజీ, మద్యం కుంభకోణం, ఎన్నికల హామీలు నెరవేర్చడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కేంద్రం నిధులతోనే రాష్ట్రంలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఈ నెల 15న తలపెట్టనున్న నిరుద్యోగ మార్చ్‌ను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ మార్చ్‌కు మేధావులు, నిరుద్యోగులు, విద్యార్థులతోపాటు అన్ని వర్గాల యువత పాల్గొనాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు సింగారపు సురేష్, బీజేవైఎం మండల అధ్యక్షుడు కక్కెర్ల అనిల్‌కుమార్, నాయకులు రాంగోపాల్, వెంకన్న, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలి

- డిప్యూటీ డీఎంహెచ్ఓ ప్రకాశ్



నెక్కొండ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నర్సంపేట డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రకాశ్ అన్నారు. మండలంలోని అలంకానిపేట పీహెచ్‌సీ పరిధిలోని నాగారం సబ్ సెంటర్‌లో నక్కలగుట్ట తండా జీపీలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించారు. కంటి వెలుగు సేవలు, వసతుల ఏర్పాట్లను ఆయన అడిగి తెలుసుకున్నారు. శిబిరానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి, మాట్లాడారు. కంటి వెలుగులో అర్హులైన వారందరికీ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి అద్దాలను అందించాలన్నారు. కంటి వెలుగును విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అంశమ్మ, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అరుణ్‌కుమార్, ఆప్తాలమిస్టు అనిల్, సూపర్‌వైజర్ రాజు, డాటా ఎంట్రీ ఆపరేటర్ అఖిల, సిబ్బంది తోట పద్మ, అరుణ, సుజాత, ఆశ కార్యకర్తలు కల్యాణి, అరుణ, కవిత, తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



నల్లబెల్లి: మండలంలోని మూడుచెక్కలపల్లి గ్రామంలో గుడుంబా తయారీ స్థావరాలపై నల్లబెల్లి ఎస్సై అజ్మీరా సురేష్, నర్సంపేట ఎక్సైజ్ ఎస్సై రాజేశ్వర్లు సంయుక్తంగా బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గుడుంబా తయారీ కోసం నానబెట్టిన సుమారు 300 లీటర్ల బెల్లం పానకాన్ని పారపోసి డ్రమ్ములను ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. 20 లీటర్ల గుడుంబా, 5 కిలోల పటికను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు మూడు చెక్కలపల్లి గ్రామానికి చెందిన గుగులోత్ కిషన్, భూక్య మంగమ్మ, గుగులోత్ శ్రీదేవిలపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై రాజేశ్వరి, హెడ్ కానిస్టేబుల్ వాల్యా, రవీందర్, కానిస్టేబుల్స్ చంద్రమోహన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సెక్షన్‌ని.. నేనొదల!

ఎంజీఎంలో కొందరు ఏళ్ల తరబడి ఒకే విభాగంలో తిష్ట

- అధికారులకు సవాల్‌గా మారిన మార్పు
- మారుస్తున్నట్లు తెలిసిన వెంటనే పైరవీలు
- ఉద్యోగ సంఘాల పేరుతో విధులకు డుమ్మా
- నిస్సహాయ స్థితిలో పరిపాలనాధికారులు



ఎంజీఎం : 'సెక్షన్‌లను (విభాగాలు) మారుస్తాం.. ప్రక్షాళన చేస్తాం.. ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గేది లేదు.' అని సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రతి అధికారి చెప్పే మొదటిమాటలు. కానీ కాలం గడిచే కొద్దీ ఆయా సెక్షన్ల సిబ్బంది చేసే చాకచక్యతనానికి పరిపాలనాధికారులు బుట్టలో పడక తప్పని పరిస్థితి. ఒకవేళ సెక్షన్లు మార్చే పరిస్థితి వస్తే వెంటనే పైరవీలు.. పైనుంచి ఒత్తిళ్లు. దీంతో చేసేది లేక ఆ ఫైల్‌ను పక్కనపడేయాల్సిందే. ఇదీ వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో కొనసాగుతున్న పరిపాలన తీరు. కొందరు ఉద్యోగులు ఏళ్ల తరబడి ఒకే సెక్షన్లలో పాతుకుపోవడంతో వారు చెప్పిందే వేదం. ఇక మరికొందరు అయితే ఉద్యోగ సంఘాల ప్రొటోకాల్ పేరుతో ఎప్పుడు వస్తారో.. తెలియని దుస్థితి.

పరిపాలన సౌలభ్యం కోసం..

ఎంజీఎంలోని మినిస్టీరియల్ సిబ్బందిని అకౌంట్స్, స్టోర్స్, ఎస్టాబ్లిష్‌మెంట్, సూపరింటెండెంట్ పేషీ వంటి విభాగాలుగా విభజించి అందులో పనిచేసే విధంగా విధులు కేటాయించారు. ఆస్పత్రిలో చికిత్స పొందే రోగులకోసం విధుల నిర్వర్తించే వైద్యులు, వైద్యసిబ్బంది, సదరం సర్టిఫికెట్లు, వేతనాలు బిల్లులు, ఔషధాల కొనుగోలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, వివిధ వార్డుల్లో అవసరమయ్యే సామగ్రి కొనుగోలు వంటి అంశాల్లో ఆయా సెక్షన్ల మినిస్టీరియల్ సిబ్బంది కీలకంగా వ్యవహరిస్తారు. ప్రతి మూడేళ్లకోసారి అన్ని సెక్షన్‌లు మారిస్తే అందరికి అనువుగా ఉంటుందని పరిపాలనాధికారులు నిత్యం పేర్కొంటారు. కానీ ఈ ఆస్పత్రిలో సాధ్యం కావడం లేదు. ఈ విభాగాల్లో స్టోర్స్ విభాగంతోపాటు స్టేషనరీ, అకౌంట్స్ విభాగంలో బిల్లులు చెల్లించే ఏ2 సెక్షన్, ఎస్టాబ్లిష్‌మెంట్‌లో ప్లానింగ్, ఆరోగ్యశ్రీ వంటి కొన్ని కీలకంగా ఉంటాయి. ఈ విభాగాల్లో కొనసాగాలన్నా, కేటాయింపులు జరగాలన్నా కొందరు పరిపాలనాధికారుల ఆశీర్వాదాలు.. ఉద్యోగ సంఘాల నేతల అండదండలు తప్పనిసరి.

ఏళ్ల తరబడిగా తిష్ట..

- సూపరింటెండెంట్ కార్యాలయంలో సీసీగా ఒకే వ్యక్తి 20 ఏళ్లుగా పనిచేస్తున్నాడు. అతన్ని సెక్షన్ మార్చేందుకు ఎవరూ ధైర్యం చేయడం లేదు. ఒకవేళ మార్చినా.. అతనినే ఆ సెక్షన్‌లోని తీసుకోవాలంటూ రాష్ట్ర, జిల్లాస్థాయి ఉద్యోగ సంఘాల నేతలు రంగంలోకి దిగుతారు. ఇటీవల అతని సెక్షన్ మార్చారు. వారం రోజుల్లో తిరిగి అదే సెక్షన్‌లో విధులు నిర్వర్తించేలా కొందరు నేతలు తమదైన శైలిలో చక్రం తిప్పారు.
- స్టేషనరీ విభాగంలో పనిచేస్తున్న సిబ్బందిది కూడా అదే పరిస్థితి. ఇందులో ఓ వ్యక్తి సుమారుగా 12 ఏళ్లుగా కొనసాగుతున్నాడు.
- కీలకమైన విభాగమైన ఆరోగ్యశ్రీ, స్టోర్స్‌లలో ఉద్యోగ సంఘాల నేతలకు అనుగుణంగా వ్యక్తులకు మాత్రమే పోస్టులు దక్కుతాయి. ఇందులో పనిచేయాలంటే సాధారణ క్లర్కులకు సాధ్యం కాదు. ఎంజీఎం ఆస్పత్రిలో మినిస్టీరియల్ సిబ్బందిలో సుమారు 40మంది ఉంటే ఈ విభాగంలో ఇప్పటివరకు 8 నుంచి 10 మంది వరకు మాత్రమే పనిచేశారు. వీళ్లు ఇతరులను రానీయని పరిస్థితి.
- బ్లడ్‌బ్యాంక్‌లో ఓ వ్యక్తి పదేళ్లకుపైగా కొనసాగుతున్నాడు.

అనుకూలురకు టెండర్లు దక్కితేనే సరి..

ఆస్పత్రికి అవసరమైన సామగ్రికి టెండర్ ప్రక్రియలు సైతం ఒక్కోసారి పూర్తి కాకుండా.. రీ నోటిఫికేషన్‌లతో పిలిస్తే తుదిదశకు చేరని పరిస్థితి. సెక్షన్లలో ఏళ్ల తరబడి పాతుకుపోయిన మినిస్టీరియల్ సిబ్బంది వారికి అనుకూలంగా ఉండే వ్యక్తులకు టెండర్ దక్కేలా వ్యవహరిస్తారు. టెండర్‌లో వారికి అనుకూలమైన వ్యక్తి కాకుండా మరో వ్యక్తి ఎంపిక అయితే ×అన్యాయంగా ఎంపికయ్యారు.. టెండర్లలో నిబంధనలు తుంగలో తొక్కారు×.. అంటూ కోర్టును ఆశ్రయించేలా చూసుకుంటారు. తమవాటా ఎక్కడ పోతోందన్న భయమే ఇందుకు కారణం. ఇలాంటి విషయాలు ఆస్పత్రిలో నిత్యం వివాదాస్పదమవుతున్నాయి.

సంఘాల నాయకులమంటూ విధులకే ఎగనామం

ఎంజీఎం ఆస్పత్రిలో విధులు నిర్వర్తించే కొంతమంది సెక్షన్ క్లర్కులు వివిధ సంఘాలకు కీలక వ్యక్తులకు కొనసాగుతున్నారు. ఈ క్రమంలో వారు ప్రొటోకాల్ పేరుతో ఎప్పుడు విధులకు వస్తారో.. తెలియని పరిస్థితి. ఈ విషయంలో పరిపాలనాధికారులు క్రమశిక్షణ చర్యలు తీసుకుంటే రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గక తప్పడం లేదు. మొత్తానికి ఎంజీఎం ఆస్పత్రిలో సెక్షన్లను మార్చడం.. పరిపాలన సరిదిద్దడం అధికారులకు పెద్ద సవాల్‌గా మారిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

> **త్వరలో సెక్షన్లు మారుస్తాం**
>
> ఎంజీఎంలో పలు సెక్షన్లలో సిబ్బందిని త్వరలో మారుస్తాం. మార్చి వరకు ఆర్థికసంవత్సరం ముగింపు ఉండడంతో మార్చడం కుదరలేదు. చాలా సంవత్సరాలుగా ఒకేసెక్షన్‌లో పనిచేస్తున్న సిబ్బందిని గుర్తించి ఇతర సెక్షన్‌లో మారుస్తాం. పరిపాలన సక్రమంగా సాగేందుకు ప్రక్షాళన అవసరం.
>
> - చంద్రశేఖర్, ఎంజీఎం సూపరింటెండెంట్

'హిందీ' లీకేజీలో పోలీసుల దూకుడు!

తాజాగా మరో ముగ్గురి అరెస్ట్..

- వర్షిత్ బెయిల్, పోలీస్ కస్టడీ విచారణ నేటికి వాయిదా
- బెయిల్‌పై విడుదలైన ప్రశాంత్, మహేష్, శివగణేష్
- కేసులో తొమ్మిదికి చేరిన అరెస్టులు.. మరొకరి కోసం పోలీసుల ఆరా
- ముగిసిన కీలక వ్యక్తుల విచారణ.. 171కి చేరిన నోటీసుల సంఖ్య
- అన్ని ఆధారాలతో పకడ్బందీగా చార్జ్‌షీట్ దాఖలుకు కసరత్తు

సాక్షిప్రతినిధి, వరంగల్: పదో తరగతి హిందీ ప్రశ్నపత్రం మాల్‌ప్రాక్టీస్ కేసులో పోలీసులు దూకుడు పెంచారు. ఓ వైపు అరెస్టులు, రిమాండ్‌కు తరలింపు.. మరోవైపు కస్టడీ పిటిషన్, సాంకేతిక ఆధారాల సేకరణ, తాజాగా ముగ్గురు నిందితుల అరెస్టు చేసి ముందుకు సాగుతున్నారు. ఈ కేసులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ సహా మొత్తం 10 మందిని నిందితులుగా చేర్చిన పోలీసులు.. ఇప్పటివరకు తొమ్మిదిమందిని అరెస్టు చేసి కోర్టులో హాజరు.. రిమాండ్‌కు పంపగా నలుగురు షరతులతో కూడిన బెయిల్‌పై విడుదలయ్యారు. ఏ10 నిందితుడిగా ఉన్న పోతరబోయిన వర్షిత్ ను రెండు రోజుల కింద అరెస్టు చేసి రిమాండ్‌కు పంపిన పోలీసులు.. కస్టడీ కోసం బుధవారం హనుమకొండ నాల్గవ మున్సిఫ్ కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై ప్రాసిక్యూషన్ వారు వాదనలు వినిపించారు. న్యాయమూర్తి మట్ట సరిత తీర్పును గురువారానికి వాయిదా వేశా రు. వర్షిత్ తరఫున న్యాయవాదులు వేసిన బెయిల్ పిటిషన్ పై గురువారమే వాదనలు జరగనున్నాయి.

సాంకేతిక ఆధారాల సేకరణ.. చార్జ్‌షీట్ దిశగా పోలీసులు

ఈ నెల 4న పరీక్ష జరుగుతున్న సమయంలో హనుమకొండ జిల్లా కమలాపూర్ జెడ్పీ పాఠశాలలో వెలుగుచూసిన పదో తరగతి హిందీ ప్రశ్నపత్రం కాపీ కుట్ర కేసులో సాంకేతిక ఆధారాల సేకరణపై పోలీసులు దృష్టి పెట్టారు. ఈ సంఘటన వెలుగులోకి వచ్చిన 48 గంటల్లో వివిధ కోణాల్లో రూపాంతరం చెంది రాజకీయ దుమారానికి కారణమైంది. అయినప్పటికీ వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ పర్యవేక్షణలో అన్ని కోణాల్లో విచారణ జరిపిన పోలీసులు నిందితుల గుర్తింపు, అరెస్టు, రిమాండ్‌కు తరలింపు ప్రక్రియకు అంతరాయం కలగకుండా వ్యవహరించారు. వీలైనంత తొందరగా ఈ కేసు పరిశోధనను ముగించి చార్జ్‌షీట్ దాఖలు చేసి అనుమానాలు.. అపోహలకు తెరవేసే దిశగా ముందుకు సాగే క్రమంలో మరిన్ని సాంకేతిక ఆధారాల సేకరణ కోసం బండి సంజయ్, పి.వర్షిత్‌లపై కస్టడీ పిటిషన్‌లు దాఖలు చేశారు. బండి సంజయ్‌ను 6న బెయిల్‌పై విడుదలకు ఆదేశించిన కోర్టు.. వర్షిత్ కస్టడీ, బెయిల్ పిటిషన్‌ల విషయంలో గురువారం నిర్ణయం తీసుకోనుంది. ఇదిలా ఉండగా ఈ కేసులో తాజాగా బుధవారం కమలాపూర్ మండలకేంద్రానికి చెందిన ఏ6 పోగుల సుభాష్, నేరెళ్లకు చెందిన ఏ8 దూలం శ్రీకాంత్, వంగపల్లికి చెందిన ఏ9 పెరుమాండ్ల శ్రామిక్ అలియాస్ నానిలను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు కమలాపూర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ సంజీవ తెలిపారు. కాగా, ఏ7 పోగు శశాంక్ అలియాస్ రింకు పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది.

> **నోటీసుల పరంపర... కొనసాగుతున్న విచారణ**
>
> ఎస్ఎస్‌సీ 2019–20 వాట్సాప్ గ్రూప్‌తోపాటు రెండు మీడియా గ్రూపులు, ఈ కేసులో నిందితులుగా ఉన్న కీలక వ్యక్తులు ఇతర నాయకులు, వ్యక్తులకు చేసిన పోస్టింగ్‌ల ఆధారంగా జారీ చేసిన నోటీసుల సంఖ్య 171కి చేరినట్లు తెలిసింది. ఐటీ కోర్, సైబర్ క్రైం బృందాలు ఇందుకోసం నిరంతరం పనిచేస్తుండగా, డీసీపీ, ఏసీపీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు రంగంలో ఉన్నాయి. ఇప్పటికే సేకరించిన సాంకేతిక ఆధారాల ప్రకారం నోటీసులు జారీ చేసిన పోలీసులు వారి విచారణను కొనసాగిస్తున్నారు. ప్రముఖంగా మాజీ మంత్రి, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను గత సోమవారం పోలీస్ కమిషనరేట్‌లో విచారించిన పోలీసులు.. అంతకుముందు రోజు ఆయన పీఏలు నరేందర్, రాజిరెడ్డిలను విచారించారు. మీడియా గ్రూపులకు చెందిన కొందరితోపాటు ఇతర పార్టీలు, వ్యక్తులను కూడా పదో తరగతి హిందీ పేపర్ విషయమై ఆరా తీశారు. నోటీసులు ఇచ్చిన వ్యక్తుల విచారణలో లభించే ఆధారాలను బట్టి ఇంకా నోటీసుల ప్రక్రియ కొనసాగించి వారిని కూడా విచారించే అవకాశం ఉందని కూడా తెలుస్తోంది. వీలైనంత త్వరగా ఈ కేసు పరిశోధనను పూర్తి చేసేందుకు కమిషనరేట్ కార్యాలయంలోని స్పెషల్ టీమ్, కాజీపేట ఏసీపీ కార్యాలయం, కమలాపూర్ పోలీస్‌స్టేషన్, ఐటీ కోర్, సైబర్‌క్రైం బృందాలు నిరంతరంగా పనిచేస్తున్నాయి.

మార్కెట్‌కు మంచి పేరు తీసుకురావాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

- కలెక్టర్ పి.ప్రావీణ్య

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు మంచిపేరు తీసుకురావడానికి అందరూ సహకరించాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మిర్చి కొనుగోళ్లపై మార్కెట్ పాలకవర్గం, చాంబర్ ఆఫ్ కామర్స్, వ్యాపారస్తులు, రైతులతో జరిగిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇంటర్నేషనల్ గ్లోబల్ మార్కెట్లతో పోటీ పడే విధంగా ఏనుమాముల మార్కెట్ అభివృద్ధి కావాలన్నారు. రైతులకు మంచి రేటు రావాలని, వారు పెట్టిన పెట్టుబడికి లాభాలు వచ్చే విధంగా అందరూ తమ వంతు కృషి చేయాలన్నారు. మిర్చిని బస్తాల్లో ప్యాకింగ్ చేసే విషయంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీవత్స, జేడీఎం మల్లేషం, డీఎంఓ ప్రసాదరావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, చాంబర్ ప్రతినిధులు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, వేద ప్రకాశ్, మార్కెట్ పాలకవర్గం, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బూత్‌స్థాయి అధికారులే కీలకం

ఓటర్ జాబితా రూపకల్పనలో బూత్ స్థాయి అధికారులే కీలకమని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. బుధవారం హైదరాబాద్ నుంచి సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి టి.రవికిరణ్‌తో కలిసి కలెక్టర్లతో ఓటర్ జాబితాలో పీఎస్ఈ ఎంట్రీ ధ్రువీకరణ, ఓటర్ ఎపిక్ కార్డుల జారీ, బూత్ లెవెల్ అధికారుల నియామకం తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫొటో సిమిలర్ ఎంట్రీ మొదటి దఫా కింద క్షేత్రస్థాయిలో తొలగించిన ఓట్ల వివరాలను మరోసారి పరిశీలించాలని సూచించారు. కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ ఎస్ఎస్ఆర్–2023లో భాగంగా పూర్తిగా తొలగించిన 193 ఫొటో సిమిలర్ ఎంట్రీలను మళ్లీ విచారణ చేసి అర్హులైన వారిని ఓటరుగా నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీవత్స కోట, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నేటినుంచి టెన్త్ స్పాట్ వాల్యుయేషన్

- సీఈ, ఏఈలుగా 950మంది టీచర్ల నియామకం
- స్పెషల్ అసిస్టెంట్లుగా మరో 350మంది
- 2.80లక్షల జవాబుపత్రాలు రాక

విద్యారణ్యపురి: పదో తరగతి పరీక్షలు ముగిసిన నేపథ్యంలో గురువారంనుంచి హనుమకొండ జిల్లా కాజీపేటలోని ఫాతిమా హైస్కూల్‌లో జవాబుపత్రాల మూల్యాంకనం (స్పాట్ వాల్యుయేషన్) నిర్వహించనున్నారు. ఈ మేరకు క్యాంప్ ఆఫీసర్ డీఈఓ ఎండీ అబ్దుల్‌హై, ఏసీజీ చలపతిరావు ఏర్పాట్లు పూర్తి చేశారు. చీఫ్ ఎగ్జామినర్లు (సీఈ), అసిస్టెంట్ ఎగ్జామినర్లు(ఏఈ)గా 950మంది ఉపాధ్యాయులను నియమించారు. వీరు ఆరు సబ్జెక్టుల జవాబపత్రాలను మూల్యాంకనం చేస్తారు. మరో 350మంది ఉపాధ్యాయులు స్పెషల్ అసిస్టెంట్లుగా భాగస్వాములు కానున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని హనుమకొండ, వరంగల్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్ జిల్లాలోని ఆయా సబ్జెక్టుల స్కూల్ అసిస్టెంట్లను సీనియారిటీని బట్టి నియమించారు. వీరికి ఆర్డర్లు కూడా ఇచ్చారు. స్పాట్‌క్యాంపునకు ఉమ్మడి జిల్లా పరిధిలోని అన్ని జిల్లాలనుంచి సబ్జెక్టులు కలిపి 2.80లక్షల జవాబుపత్రాలు వచ్చాయి.

నేటి ఉదయం 8 గంటలకు రిపోర్ట్ చేయాలి..

తెలుగు, హిందీ, ఇంగ్లిష్, సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టుల జవాబుపత్రాలను మూల్యాంకనం చేసే స్కూల్ అసిస్టెంట్‌లు గురువారం ఉదయం 8గంటలకు కాజీపేట ఫాతిమా హైస్కూల్ స్పాట్ వాల్యుయేషన్ కేంద్రంలో సంబంధిత అధికారులకు రిపోర్టు చేయాల్సింటుంది. మొదట క్యాంపు ఆఫీసర్ పలు సూచనలు చేస్తారు. అనంతరం మూల్యాంకనం ప్రారంభిస్తారు. ఈ నెల 11న సోషల్ స్టడీ సబ్జెక్టు పరీక్ష ముగిసినందున ఈ సబ్జెక్టు స్కూల్ అసిస్టెంట్‌లు మాత్రం 14న రిపోర్టు చేయాలని క్యాంప్ ఆఫీసర్ అబ్దుల్‌హై కోరారు.

ఉన్నతాధికారుల ఆరా!

నియామకం ఫైల్‌తో కలెక్టరేట్‌కు డీడబ్ల్యూఓ

- బదిలీపై వచ్చారని సమాధానం చెబుతున్న అధికారి
- సమగ్ర విచారణ చేపట్టే అవకాశం

కాశీబుగ్గ/ కాజీ సెంటర్: మహిళా శిశు సంక్షేమ శాఖలో కొంతమంది ఉన్నతాధికారులు బాలల పరిరక్షణ విభాగంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను జీఓలకు విరుద్ధంగా కాంట్రాక్ట్ ఉద్యోగ నియామకాలు చేపడుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఈ నెల 10న 'నోటిఫికేషన్ లేకుండానే ఉద్యోగ భర్తీ' అనే కథనం సాక్షిలో ప్రచురితమైన విషయం విధితమే. దీనిపై సంక్షేమశాఖ ఉన్నతాధికారులు ఆరా తీసి కాంట్రాక్ట్ నియామకం ఫైల్‌ను పరిశీలించినట్లు సమాచారం. ఈ విషయంలో డీడబ్ల్యూఓ వాస్తవ విషయాలు అధికారులకు వివరించకుండా జరిగిన తప్పిదాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. మంచిర్యాల జిల్లా బాలల పరిరక్షణ విభాగంలో పీఓ–ఎన్ఐసీగా ఉద్యోగం చేస్తున్న ఉద్యోగి 2020 ఆగస్టు మాసంలో తాను ఉద్యోగం చేయలేనని రాజీనామా చేస్తున్నట్లు అధికారులకు విన్నవించుకోగా వెంటనే సంబంధిత అధికారులు ఆమోదం తెలిపినట్లు రికార్డులో నమోదు చేశారు. వరంగల్ జిల్లాలో పీఓ–ఎన్ఐసీ పోస్టు ఖాళీగా ఉండగా ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా నియమించారు. కానీ డీడబ్ల్యూఓ అందుకు భిన్నంగా వివరణ ఇస్తూ తాను జిల్లాకు రాకముందే సదరు ఉద్యోగి బదిలీపై ఉద్యోగంలో చేరారని చూపుతున్నారు. వాస్తవానికి సొసైటీ గైడ్‌లైన్స్ మేరకు బాలల పరిరక్షణ విభాగంలో ఖాళీల భర్తీని కాంట్రాక్ట్ ప్రాతిపదికన నోటిఫికేషన్ ద్వారా స్థానికులచే అర్హతలను బట్టి జిల్లా సెలక్షన్ కమిటీ భర్తీ చేస్తుంది. వీరికి సర్వీస్ రూల్స్ ప్రకారం బదిలీ గాని అప్‌గ్రేడ్ (ప్రమోషన్స్) డిప్యూటేషన్స్ ఉండవు. కానీ ఇక్కడ మాత్రం అందుకు విరుద్ధంగా జరిగింది.

బదిలీ ఉత్తర్వులు ఇవ్వడానికి తిరస్కరణ

జిల్లా సంక్షేమ శాఖలోని బాలల పరిరక్షణ విభాగంలో పీఓ–ఎన్ఐసీగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి నియామకం గురించి సమాచార హక్కు చట్టం ద్వారా ఓ వ్యక్తి దరఖాస్తు చేయగా సమాచారం ఇవ్వడానికి తిరస్కరించారు. ఆ ఉద్యోగి మంచిర్యాల జిల్లా నుంచి వరంగల్ జిల్లాకు బదిలీపై వస్తే అందుకు సంబంధించిన ఉత్తర్వులను ఎందుకు ఇవ్వడం లేదని ఆర్టీఐ దరఖాస్తుదారుడు ప్రశ్నిస్తున్నాడు. అక్రమ నియామకం ప్రక్రియ కొంత మంది ఉన్నతాధికారులు డైరెక్టర్ ఫర్ సిగ్నేచర్‌తో అడ్డదారిలో ఈ వ్యవహారం నడిపిస్తున్నట్లు సమాచారం. 'సాక్షి' కథనంతో స్థానికులు ఎంఎస్ డబ్ల్యూ పూర్తి చేసిన నిరుద్యోగులు ఉన్నతాధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే బెదిరింపులకు పాల్పడినట్లు సమాచారం.



బాలల పరిరక్షణ కార్యాలయం

సమగ్ర విచారణ చేపట్టే అవకాశం

మహిళా శిశు సంక్షేమ శాఖలో అక్రమ నియామకాల విషయంపై కొంత మంది నిరుద్యోగులు డైరెక్టర్, ఆర్జేడీకి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడంతో సమగ్ర విచారణ చేపట్టనున్నట్లు తెలిసింది. ఈ అక్రమ నియామకాల వెనకాల ఎవరు ఉన్నారు, ఇంకా ఎంత మందిని భర్తీ చేశారన్న విషయంపై సమగ్ర విచారణ చేపట్టేందుకు సిద్ధం అయినట్లు సమాచారం.

'గ్రీన్‌ఫీల్డ్ హైవేకు భూములివ్వం'

సంగెం: నాగపూర్–విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం కోసం తమ పంట భూములు ఇవ్వమని నిర్వాసిత రైతులు తెగేసి చెప్పుతున్నారు. సంగెం మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం జాతీయ రహదారుల సంస్థ గ్రీన్‌ఫీల్డ్ హైవే భూసేకరణ అవార్డు విచారణ కార్యక్రమాన్ని వరంగల్ ఆర్డీఓ మహేందర్‌జీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన రైతులు తమకు పంట భూములే జీవనాధారమని, అవి కోల్పోతే ఎలా జీవించాలని, తమ వారసులకు ఏం ఇవ్వాలని ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు నిర్వాసిత రైతులు మాట్లాడుతూ తమకు భూమికి బదులుగా భూమి ఇవ్వాలని, లేని పక్షంలో మార్కెట్ విలువ ప్రకారం ఎకరానికి కోటిన్నర చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మహేందర్‌జీ మాట్లాడుతూ చింతలపల్లి శివారులో 74 మంది రైతులకు చెందిన 44 ఎకరాలకు ఎకరానికి రూ 19.08 లక్షలు, సంగెం శివారులో 57 మంది రైతులకు చెందిన 22.29 ఎకరాలకు ఎకరానికి రూ 29.18 లక్షల చొప్పున పరిహారం అందుతుందన్నారు. రైతులు ఒప్పుకోకపోవడంతో రైతుల అభ్యంతరాలను కలెక్టర్‌కు, జాతీయ రహదారుల రిజినల్ అధికారులకు నివేదిస్తామని తెలిపారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ రాజేశ్వర్‌రావు, డీటీ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీపీ కళావతి, బాబు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో మంటలు





సురక్షితంగా బస్సు దిగిన ప్రయాణికులు, బస్సును ముందుకు తోస్తున్న గ్రామస్తులు

- ఆర్పిన తండావాసులు
- తప్పిన పెను ప్రమాదం
- బుధవారం రాత్రి 11.15 గంటలకు ఘటన

వర్ధన్నపేట: టీఎస్ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగిన సంఘటన మండలంలోని డీసీతండాలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తొర్రూర్ డిపోకు చెందిన టీఎస్ఆర్టీసీ బస్సు వర్ధన్నపేట, జనగాం మీదుగా బోరబండకు పోయి తిరిగి తొర్రూర్‌కు వెళ్తోంది. ఈ క్రమంలో బుధవారం రాత్రి 11.15గంటలకు వర్ధన్నపేట దాటి డీసీ తండా శివారుకు చేరుకోగానే షార్ట్ సర్క్యూట్‌తో మంటల చెలరేగి పొగలు కమ్ముకున్నాయి. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ బస్సును డీసీ తండా వద్దకు చేర్చి పక్కకు నిలిపారు. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న 12 మంది ప్రయాణికులు సురక్షితంగా కిందకు దిగారు. స్పందించిన తండా వాసులు నీటితో మంటలను ఆర్పారు. ఓవర్ హీట్ కారణంగా బస్సు డీజిల్ ట్యాంక్ పగిలి నేల పాలయ్యింది. చెలరేగిన మంటలకు డీజిల్ తోడైతే ప్రమాదకర పరిస్థితి ఏర్పడేది. పెను ప్రమాదం తప్పడంతో ప్రయాణికులతో పాటు గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

వరకట్న వేధింపులకు బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ బలి


జ్యోతి(ఫైల్)

గీసుకొండ: అదనపు కట్నం వేధింపులకు ఓ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ బలయ్యారు. ఆమె భర్త, అత్తమామలు, ఆడబిడ్డలు అదనపు కట్నం కోసం వేధించడంతో మండలంలోని సూర్యతండాకు చెందిన వాంకుడోతు జ్యోతి(31) అసిస్టెంట్ బ్యాంకు మేనేజర్ పురుగుల మందు తాగి మృతి చెందింది. గీసుకొండ ఇన్‌స్పెక్టర్ సట్ల రాజు కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం సుజాతనగర్ మండలంలోని లక్ష్మీదేవిపల్లికి చెందిన జ్యోతికి గీసుకొండ మండలం సూర్యతండాకు చెందిన వాంకుడోతు స్వామితో 2017లో వివాహం జరిగింది. జ్యోతి తల్లిదండ్రులు స్వామికి రూ.15 లక్షల కట్నంతో పాటు ఇతర లాంఛనాలతో పెళ్లి జరిపించారు. వీరికి ఇద్దరు కుమారులున్నారు. స్వామి రైల్వేలో కమర్షియల్ ఇన్‌స్పెక్టర్‌గా, జ్యోతి వరంగల్ నగరంలోని కాశిబుగ్గ ఇండియన్ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. ప్రస్తుతం వీరు నగరంలోని శంభునిపేటలో సొంత ఇల్లు కట్టుకుని కాపురం ఉంటున్నారు. ఇటీవల ఇద్దరు కుమారులను తీసుకుని సెలవులు, పండుగ కోసం సూర్యతండాకు వచ్చిపోతున్నారు. జ్యోతి సూర్యతండాకు వచ్చిన ప్రతీసారి ఆమె అత్తామామలు అంబాలి, రాములు, ఆడబిడ్డలు శారద, జ్యోతి, విజ్జి, సునిత అదనపు కట్నం కోసం వేధించేవారు. ఈనెల 2ను స్వామి, జ్యోతి తమ కుమారులను తీసుకుని సూర్యతండాకు రాగా.. జ్యోతిని ఆమె భర్త అత్తమామలు, ఆడబిడ్డలు, అదనపు కట్నం కోసం వేధించడంతో ఆమె గడ్డిమందు తాగింది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆమెను వరంగల్ నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆమె బుధవారం మృతి చెందింది. మృతురాలి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు స్థానిక తహసీల్దార్ విశ్వనారాయణ శవ పంచనామా జరిపించగా మృతురాలి భర్త, అత్త, మామ, ఆడబిడ్డలపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ సట్ల రాజు తెలిపారు.

గంజాయి విక్రయదారుడి అరెస్ట్

వరంగల్ క్రైం: గంజాయి అమ్మకానికి పాల్పడుతున్న హైదరాబాద్ రామకృష్ణకాలనీకి చెందిన చిదురాల నితిన్‌ని పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి తెలిపారు. నిందితుడి నుంచి 1.2 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. మరో నిందితుడు వెంకటేశ్వర్లు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈదాడిలో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు, ఎస్సైలు లవన్‌కుమార్, నిసార్ పాషా, శరత్‌కుమార్ ఉన్నారు.

కోల్‌బెల్ట్‌పై పార్టీల గురి..

అరు జిల్లాలు, 11 నియోజకవర్గాల్లో సింగరేణి ఎన్నికల టెన్షన్

- ఈనెలాఖరులో నోటిఫికేషన్.. మే నెలలో పోలింగ్‌కు అవకాశం
- అసెంబ్లీ ఎన్నికలకు ప్రీఫైనల్‌గా భావిస్తున్న రాజకీయ పార్టీలు
- బొగ్గు గనులు, కార్మికుల ఓట్లే లక్ష్యంగా వాడీవేడి విమర్శలు
- అస్త్రశస్త్రాలు ప్రయోగించేందుకు అధికార విపక్షాలు సన్నద్ధం





సాక్షిప్రతినిధి, వరంగల్: తెలంగాణలో ప్రధాన రాజకీయ పార్టీలకు సింగరేణి ఎన్నికల గుబులు పట్టుకుందా? త్వరలో జరగబోయే గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలను ప్రతిపక్షాలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయా?.. అంటే అవుననే సమాధానం వస్తోంది. ఈ ఏడాది చివరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల ముందు జరగనున్న సింగరేణి ఎన్నికల్లో కార్మికులు ఏ పార్టీకి షాక్ ఇచ్చే అవకాశాలున్నాయన్న చర్చ జోరందుకుంది. ఆరు జిల్లాలు 11 అసెంబ్లీ నియోజకవర్గాల్లో విస్తరించి ఉన్న సిరుల మాగాణి సింగరేణి ఎన్నికలు రాజకీయ పార్టీలకు ప్రీఫైనల్‌గా మారనున్నాయని చర్చ కూడా సాగుతోంది.

గత ఎన్నికల్లో టీబీజీకేఎస్‌కు పట్టం

సింగరేణి.. కొత్తగూడెం, ఖమ్మం, భూపాలపల్లి, పెద్దపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలోని 11అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో విస్తరించి ఉంది. గత 2017 అక్టోబరు 5న జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అనుబంధ కార్మిక సంఘం టీబీజీకేఎస్ 11 స్థానాలకుగాను 9స్థానాల్లో జయకేతనం ఎగురవేసింది. మందమర్రి, భూపాలపల్లి మినహా అన్ని డివిజన్లలో విజయం సాధించింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టీయూసీ పోటీకి దూరంగా ఉండి, సీపీఐ అనుబంధ ఏఐటీయూసీకి మద్దతిచ్చింది. సింగరేణిలో మొత్తం 52,543 ఓట్లు ఉండగా.. గత ఎన్నికల్లో 49,877 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీటిలో టీబీజీకేఎస్‌కు 23,848 ఓట్లు పోలవగా.. ఏఐటీయూసీ కూటమికి 19,631 ఓట్లు వచ్చాయి. 4,217 ఓట్ల తేడాతో టీబీజీకేఎస్ గుర్తింపు కార్మిక సంఘంగా అధికారం దక్కించుకుంది. 2020 ఫిబ్రవరితో గుర్తింపు సంఘం కాలపరిమితి ముగిసింది. 2017కు ముందు నాలుగేళ్ల కాల పరిమితి ఉండగా.. కేంద్ర కార్మిక శాఖ రెండేళ్లకు కుదించడంపై టీబీజీకేఎస్ కోర్టుకెక్కింది. తీర్పు ఆలస్యం కావడంతో ఆ నాలుగేళ్ల పదవీ కాలం కూడా 2021 ఫిబ్రవరిలోనే ముగిసింది. ఎట్టకేలకు కోర్టు ఆదేశంతో ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర కార్మిక శాఖ సింగరేణి యాజమాన్యం ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెలాఖరున నోటిఫికేషన్ జారీ చేసి మే నెలలో ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించడంతో రాజకీయ పార్టీలు రంగంలోకి దిగి ప్రచారం సాగించే పనిలో నిమగ్నమయ్యాయి.

గుర్తింపు ఎన్నికలపై కార్మికశాఖ కసరత్తు..

రెండేళ్లకోసారి జరగాల్సిన గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు కోవిడ్ ఎఫెక్ట్, కార్మిక సంఘాలు కోర్టు మెట్లు ఎక్కడంతో మూడేళ్లు ఆలస్యమయ్యాయి. ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో స్పష్టత లేకపోవడంతో ఏఐటీయూసీతోపాటు మరికొన్ని సంఘాలు కోర్టును ఆశ్రయించాయి. కోర్టు ఆదేశంతో కేంద్ర కార్మికశాఖ, సింగరేణి యాజమాన్యం ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమైంది. ఏప్రిల్ నెలాఖరులో నోటిఫికేషన్ జారీ చేసి మే నెలలో ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర కార్మికశాఖ కసరత్తు చేస్తోంది. ఈ ఎన్నికల్లో సత్తా చాటేందుకు అధికార పార్టీతోపాటు విపక్షపార్టీల అనుబంధ కార్మిక సంఘాలు అస్త్రశస్త్రాలు ప్రయోగించేందుకు సన్నహాలు చేస్తున్నాయి. 2017 అక్టోబర్‌లో జరిగిన ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన అధికార పార్టీ బీఆర్‌ఎస్ అనుబంధ కార్మిక సంఘం టీబీజీకేఎస్‌కు తాజా ఎన్నికలు గుబులు పుట్టిస్తున్నాయి. గత ఎన్నికల్లో ఇచ్చిన పలు హామీలను గుర్తింపు కార్మిక సంఘం నెరవేర్చకపోవడం ఆ పార్టీకి ఇబ్బందిగా పరిణమించే అవకాశాలున్నాయి. ప్రధానంగా డిపెండెంట్ ఉద్యోగాల్లో అక్రమాలు, ఆదాయపన్ను పరిమితి పెంపు విషయంలో పట్టించుకోకపోవడం ఆ సంఘానికి మైనస్‌గా మారే అవకాశం ఉందన్న చర్చ సాగుతోంది. పనిభారం విషయంలో యాజమాన్యంతో కుమ్మక్కు అయ్యిందని కార్మికులు తీవ్ర అసహనంతో ఉన్నారు.

ఆరు జిల్లాలు.. 11 అసెంబ్లీ స్థానాలపై 'సింగరేణి' ప్రభావం

2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 11 అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ ఆరు స్థానాల్లో గెలుపొందింది. మూడు స్థానాల్లో మాత్రమే బీఆర్‌ఎస్ గెలిచినప్పటికీ తర్వాత రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఏడుగురు ఇతర పార్టీల నుంచి గెలిచిన వారు గులాబీ గూటికి చేరారు. అసెంబ్లీ నియోజకవర్గాల పరంగా చూస్తే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలే ఇప్పుడు పది స్థానాల్లో ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో కార్మిక లోకంలో వీక్‌గానే ఉందనే ప్రచారం జరుగుతోంది. కొంతకాలంగా మునుగోడు ఉప ఎన్నికల నాటి నుంచి అధికారపార్టీతో దోస్తాన్ చేస్తున్న కమ్యూనిస్టులు కాస్తా సింగరేణి ఎన్నికల విషయంలో మాత్రం పొత్తులేకుండా ఒంటరిగానే పోటీ చేస్తామని స్పష్టం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితిలో గులాబీతో కలిసి వచ్చే వారు కానరాక కోల్ బెల్ట్ ఏరియా అంతా కూడా గోదావరి పరీవాహక ప్రాంతం, మావోయిస్టు ప్రాబల్యంగల ఏరియా కావడంతో అధికార పార్టీకి ప్రతికూల ఫలితాలు వస్తాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇదే సమయంలో ఈ ఏడాది చివరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ముందుగా జరుగుతున్న సింగరేణి ఎన్నికలు అధికార పార్టీతోపాటు విపక్షాలు కాంగ్రెస్, బీజేపీ, వామపక్ష పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి.

ఉత్సవాల్ని ఘనంగా నిర్వహించుకుందాం


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న అడిషనల్ కలెక్టర్ త్రిపాఠి, జల వనరుల సంస్థ చైర్మన్ వీరమల్ల ప్రకాశ్

- అదనపు కలెక్టర్ ఇలా త్రిపాఠి
- శిల్పం, వర్ణం, కృష్ణం వాల్ పోస్టర్ ఆవిష్కరణ

ములుగు: ఈనెల 18న వెంకటాపురం(ఎం) మండలంలోని రామప్ప ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్న ప్రపంచ వారసత్వ ఉత్సవాలను ఘనంగా జరుపుకుందామని అదనపు కలెక్టర్ ఇలా త్రిపాఠి, రాష్ట్ర జల వనరుల సంస్థ చైర్మన్ వీరమల్ల ప్రకాశ్ బుధవారం అన్నారు. ఈమేరకు రామప్ప హెరిటేజ్ ట్రస్ట్ కో–ఆర్డినేటర్ పాండురంగారావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్‌తో కలిసి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం 'శిల్పం, వర్ణం, కృష్ణం' వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా అడిషనల్ కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ.. స్థానికులు ఉచితంగా వెజిటేరియన్ స్టాల్స్, హ్యాండ్ క్రాఫ్ట్ స్టాల్స్ ఏర్పాటు చేసుకోవడానికి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఉదయం 10 గంటలకు ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ వీరమల్ల ప్రకాశ్ మాట్లాడుతూ.. కలెక్టర్ కృష్ణ ఆదిత్య ప్రత్యేక చొరవతో వరల్డ్ హెరిటేజ్‌తో పాటు క్లైమేట్ అవేర్నెస్ తీసుకురావడానికి రామప్ప దేవాలయంలో ప్రభుత్వం తరఫున సాంస్కృతిక కార్యక్రమాలు జరుపుకుంటున్నామని తెలిపారు. ప్రసాద్ స్కీం ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ.15 కోట్లు దేవాలయాభివృద్ధికి మంజూరు చేసిందన్నారు. ఇటీవల ఐక్యరాజ్య సమితిలో నీటి వనరుల పొదుపుపై మూడ్రోజులు ప్రసంగించిన కారణంగా.. జిల్లా ప్రజాప్రతినిధులు ప్రకాశ్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రమాదేవి, జెడ్పీ సీఈఓ ప్రసన్నరాణి, వెంకటాపురం(ఎం) ఎంపీపీ, జెడ్పీటీసీలు బుర్రి రజిత, రుద్రమాదేవి, పాలంపేట సర్పంచ్ భాగ్యలక్ష్మి, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీపతి, జిల్లా పంచాయతీ అధికారి కొండా వెంకయ్య, డీడబ్ల్యూఓ ప్రేమలత, కలెక్టరేట్ ఏఓ విజయభాస్కర్, తహసీల్దార్లు మధురకవి సత్యనారాయణరావు, మంజుల, ఎంపీడీఓ శ్రీనివాస్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేయూ దూరవిద్య పీజీ పరీక్షలు ప్రారంభం

- తొలి రోజు 26 మంది విద్యార్థుల డీబార్


సెంటర్‌ను పరిశీలిస్తున్న కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు, పరీక్షల విభాగం అధికారులు

కేయూ క్యాంపస్: కేయూ పరిధి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో దూర విద్య పీజీ కోర్సుల ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు పీజీ కోర్సుల పరీక్షల్లో యూనివర్సిటీ పరిధిలో వివిధ పరీక్షా కేంద్రాల్లో కాపీయింగ్‌కు పాల్పడుతూ.. 26 మంది విద్యార్థులు స్క్వాడ్లకు పట్టుబడి డీబార్ అయ్యారు. హనుమకొండలోని ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాల, ఉమెన్స్ పీజీ కళాశాలల పరీక్ష కేంద్రాలను కేయూ రిజిస్ట్రార్, దూర విద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య టి.శ్రీనివాస్‌రావు, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ నరేందర్ సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. ఈనెల 13 నుంచి దూరవిద్య పీజీ కోర్సుల ఫైనల్ ఇయర్ పరీక్షలు ప్రారంభం కాబోతున్నాయి.

భర్తను చంపేందుకు యత్నించిన భార్యకు జైలు

వరంగల్ లీగల్: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్త అడ్డు తొలగించేందుకు హత్యాయత్నానికి పాల్పడిన మహిళకు జైలు శిక్ష పడింది. భర్తపై హత్యాయత్నం నేరంలో హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముత్తారం గ్రామానికి చెందిన ఇల్లందుల ప్రేమలతకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ బుధవారం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి బి.శ్రీనివాసులు తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. ముత్తారం గ్రామానికి చెందిన ఇల్లందుల చొక్కయ్య, ప్రేమలత దంపతులు కూలీ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ప్రేమలత అదే గ్రామానికి చెందిన కడారి వీరభద్రయ్యతో కలిసి తిరుగుతోందని, ఇది సరైంది కాదని చొక్కయ్య ఫిర్యాదు మేరకు గ్రామ పెద్దమనుషులు ప్రేమలతను మందలించారు. అయినా ఆమెలో మార్పు రాలేదు. పైగా తన అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్న భర్తను అడ్డు తొలగించుకోవాలనే ఉద్దేశ్యంతో ప్రేమలత ప్రణాళిక వేసుకుంది. ఏప్రిల్ 24, 2014 అర్ధరాత్రి నిద్రిస్తున్న చొక్కయ్యపై గొడ్డలితో దాడి చేసింది. తలకు, చేతులకు, ఛాతిపై గాయాలై విపరీతంగా రక్తం కారుతుండగా... చొక్కయ్య గట్టిగా అరవడంతో చుట్టుపక్కల వారు రావడంతో ప్రేమలత పారిపోయింది. క్షతగాత్రుడిని స్థానికులు అర్ధరాత్రి ముల్కనూరులోని ఓ హాస్పిటల్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. గ్రామస్తుల ద్వారా విషయం తెలిసి ముల్క నూరులో ఉన్న చొక్కయ్య సోదరి పుల్ల స్వరూప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో సాక్ష్యాలు పరిశీలించిన కోర్టు నేరం రుజువు కావడంతో ప్రేమలతకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ జడ్జి శ్రీనివాసులు తీర్పు వెల్లడించారు. కేసును పోలీసు అధికారులు సతీశ్‌కుమార్, ఎం.మహేందర్ పరిశోధించగా.. లైజన్ ఆఫీసర్ డి.వెంకటేశ్వర్లు విచారణ పర్యవేక్షించారు. సాక్ష్యులను కానిస్టేబుల్ ఎ.రవి కోర్టులో ప్రవేశపెట్టగా.. ప్రాసిక్యూషన్ పక్షాన పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.భద్రాద్రి కేసు వాదించారు.

పోక్సో కేసులో ఆర్నెళ్ల జైలు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ తీర్పు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ జిల్లాలోని మరిపెడ మండలం చిన్న గూడూరు (ప్రస్తుత చిన్నగూడూరు మండలం) గ్రామానికి చెందిన ఓ యువకుడిపై నమోదైన పోక్సో కేసులో నేరం నిరూపణ కాగా.. జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ ఆ యువకుడికి ఆర్నెళ్ల జైలు శిక్ష విధిస్తూ బుధవారం తీర్పునిచ్చారు. స్పెషల్ పోక్సో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కీసర పద్మాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మరిపెడ మండలం చిన్న గూడూరు గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలికను అదే గ్రామానికి చెందిన మండల సురేశ్ తరచూ వేధించాడు. ప్రేమించమని వెంటపడుతూ.. ఇబ్బందులకు గురిచేశాడు. దీంతో బాలిక తండ్రి 2020 జూన్ 16న చిన్నగూడూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఐ ఎస్.సాగర్ సూచన మేరకు అప్పటి చిన్నగూడూరు ఎస్సై వి.విజయ్‌రాంకుమార్ కేసు నమోదు చేశారు. అనంతరం విచారణ చేపట్టి స్పెషల్ పోక్సో కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. ప్రస్తుత చిన్న గూడూరు ఎస్సై సంతోశ్ ఆధ్వర్యంలో మరిపెడ ఏఎస్సై ఎం.శంకర్, పీసీ జె.రాజు పదిమంది సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ పక్షాన స్పెషల్ పోక్సో కోర్టు పీపీ పద్మాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. వాదనలు పూర్తైన అనంతరం నేరం నిరూపితమవడంతో సురేశ్‌కు ఆర్నెళ్ల జైలు, రూ. 2వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు. నేరస్తుడిని చర్లపల్లి జైలుకు తరలించారు.

వడదెబ్బకు రైతు కూలీ మృతి



కన్నాయిగూడెం: మండల పరిధి గూర్రేవులలో వడదెబ్బతో బుధవారం రైతు కూలీ బొగ్గుల చిన్న సమ్మయ్య(59) మృతి చెందాడు. చిన్నసమ్మయ్య రోజూ మాదిరిగానే ముప్పనపల్లి గ్రామానికి చెందిన ఓ రైతుకు మల్చింగ్ కవర్ తియ్యడానికి పనికి వెళ్లాడు. ఎండతీవ్రత పెరగడంతో అతడికి వాంతులయ్యాయి. తోటి కూలీలు గమనించి బైక్‌పై ఇంటికి పంపించారు. ఇంటికి వచ్చిన కొద్ది సమయంలోనే రైతు ప్రాణం పోయింది. సమ్మయ్యకు భార్య, ఐదుగురు ఆడపిల్లలున్నారు. ఆయన మృతితో కుటుంబం రోడ్డున పడింది. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



భార్య కాపురానికి రావట్లేదని ఆత్మహత్య


రమేశ్(ఫైల్)

కాజీపేట: భార్య పిల్లలతో సహా పుట్టింటికి వెళ్లి ఉంటోందని మనస్తాపానికి గురైన విష్ణుపురి కాలనీకి చెందిన చెవుల రమేశ్(35) ఆత్మహత్య చేసుకున్నాడు. రమేశ్ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవలి కాలంలో కుటుంబ తగదాలు పెరగడంతో భార్య ఇద్దరు పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. కాగా.. రమేశ్ ఇటీవల మాచర్ల నాగేష్ అనే వ్యక్తి ఇంట్లో అద్దెకు దిగి ఒంటరిగానే జీవిస్తున్నాడు. భార్య కాపురానికి రాదేమోనని ఆందోళనకు గురైన రమేశ్ మూడ్రోజుల కింద ఇంట్లో ఉరేసుకున్నాడు. ఇంట్లో నుంచి వాసన వేస్తుండడంతో ఓనర్ గుర్తించి బంధువులకు సమాచారం ఇచ్చాడు. తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా పాక్షికంగా శరీరం కుళ్లిపోయింది. పోస్టుమార్టమ్ నిమిత్తం మృతదేహాన్ని ఎంజీఎం ఆసుపత్రికి తరలించి విచారణ జరుపతున్నట్లు ఎస్సై ప్రమోద్ కుమార్ తెలిపారు.

మనస్తాపంతో వలస కూలీ ..

సంగెం: తన వారిని వదిలి ఒంటరిగా ఉంటున్నానని మనస్తాపం చెందిన ఒడిషా రాష్ట్రం బలంగీర్ జిల్లా బాలిపాట మండలం చకమిల్ గ్రామానికి చెందిన మనుభూ (27) వరంగల్ జిల్లా సంగెం మండలంలో ఆత్మహత్య చేసుకున్నాడు. మనుభూ బంధువులతో కలిసి గతేడాది డిసెంబర్‌లో మధ్యవర్తి ద్వారా సంగెం మండలం ఆశాలపల్లిలోని నంబూరి కృష్ణ అనే ఇటుకల బట్టీ వ్యాపారి వద్ద కార్మికుడిగా పనిలో చేరాడు. కొంత కాలంగా తన తల్లి, అన్నదమ్ములు గుర్తుకు వస్తున్నారని బాధపడుతూ ఉండేవాడు. నాలుగు రోజుల క్రితం జ్వరం రాగా.. గ్రామంలోని ఓ ఆర్ఎంపీ వద్ద వైద్యం పొందాడు. మంగళవారం పనికి వెళ్లకుండా గుడిసె వద్దే ఉన్నాడు. అన్నం వండిన తర్వాత లేవమని మనుభూ చిన్నాన్న కూతురు రజనీ బరలేండియాతో చెప్పి గుడిసెలోకి వెళ్లాడు. అన్నం వండిన తర్వాత రాత్రి చూస్తే కన్పించలేదు. ఎంత వెతికినా జాడ కనిపించలేదు. ఫోన్ చేస్తే స్విచాఫ్ వచ్చింది. ఉదయం బహిర్భూమికి వెళ్లిన బావ సుభాశ్, తోటి కార్మికులు పూర్ణచంద్ర భూ, మాకారుభూలకు గొండ్ల కుంట వద్ద గల తుమ్మ చెట్టుకు మనుభూ ఉరి వేసుకుని కనిపించాడు. మృతుడి చిన్నాన్న కూతురు రజనీ బరలేండియా ఫిర్యాదు మేరకు సంగెం ఎస్సై భరత్ కేసు నమోదు చేసుకున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వేర్వేరు ప్రమాదాల్లో బుధవారం నలుగురు మృతి చెందారు.

- పొయ్యి అంటించబోతే ప్రాణం పోయింది!


రేణుక(ఫైల్)

దుగ్గొండి: పొయ్యి అంటించేందుకు టర్పెంటాయిల్ వినియోగించడంతో మంటలు అంటుకుని ఓ మహిళ మృతి చెందింది. మండలంలోని తొగర్రాయి గ్రామానికి చెందిన మండల రేణుక(32) ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని కాలిన గాయాలతో మృతి చెందింది. మంగళవారం సాయంత్రం ఆమె వంట చేయడానికి కట్టెల పొయ్యి అంటుపెడుతోంది. అయితే ఎంతకూ అంటుకోకపోవడంతో రంగులలో కలిపే టర్పెంటాయిల్‌ను పొయ్యిలో పోసి అగ్గిపుల్ల గీకింది. దీంతో ఒక్కసారిగా మంటలు లేచి రేణుక ఛాతిభాగం అంటుకుంది. చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతురాలికి భర్త కమలాకర్, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతురాలి సోదరుడు శాన శివరాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.

చింత చెట్టు నుంచి జారిపడి ఒకరు..


జితేందర్(ఫైల్)

గీసుకొండ: చెట్టు ఎక్కి చింత కాయలు తెంపుతూ జారిపడి గ్రేటర్ వరంగల్ నగరం 15వ డివిజన్ పోతరాజుపల్లికి చెందిన దుక్కిరి జితేందర్(44) బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. జితేందర్ హమాలీ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. సాయంత్రం గ్రామంలోని ఏకాంబరాజు అనే వ్యక్తికి చెందిన ఇంటి ముందు ఉన్న చెట్టుకు చింతకాయలు తెంపడానికి చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడ్డాడు. గాయపడ్డ అతడిని వెంటనే వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ.. అదే రోజు అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు వినయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ సట్ల రాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

ధర్మసాగర్: ధర్మసాగర్ పోలీస్‌స్టేషన్ పరిధి కాజీపేట మండలం రాంపూర్ శివారులోని జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి రోడ్డు ప్రమాదంలో బుధవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మసాగర్ మండలం కరుణాపురం గ్రామానికి చెందిన పసునూరి పూర్ణచందర్ (35) బుధవారం జాతీయ రహదారి మీదుగా కరుణాపురం నుంచి హనుమకొండ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఈక్రమంలో అదే రోడ్డుపై వెనకాలే వస్తున్న కారు వెనకనుంచి బైక్‌ను ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న పూర్ణచందర్ కింద పడిపోగా.. తలకి బలమైన దెబ్బ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

లారీ డ్రైవర్..


సంపత్ మృతదేహం

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలంలోని మొరంచపల్లి శివారు కొత్తపల్లి రహదారిపై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో బిల్లం సంపత్ (45) మృతి చెందాడు. భూపాలపల్లి సీఐ రాంనర్సింహారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధి భాస్కర్‌గడ్డకు చెందిన బిల్లా సంపత్ లారీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తన వ్యక్తిగత అవసరాల నిమిత్తం మండలంలోని కొత్తపల్లి(ఎస్ఎం) గ్రామం వెళ్లి వస్తుండగా.. మోరంచపల్లి గ్రామ శివారు వద్ద తన బైక్ అదుపుతప్పి కల్వర్టుకు ఢీకొట్టింది. దీంతో సంపత్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

160 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

జఫర్‌గఢ్: లారీలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మండలంలోని ఉప్పుగల్లు శివారులో బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై మాధవ్‌గౌడ్ తెలిపారు. ఉప్పుగల్లు మీదుగా బియ్యం తరలిస్తున్నట్లు అందిన సమచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో పాటు జఫర్‌గఢ్ పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన బియ్యం 160 క్వింటాళ్లు ఉన్నట్లు సుమారు వీటి విలువ రూ.4.16 లక్షలు ఉందని ఎస్సై మాధవ్‌గౌడ్ తెలిపారు. ఈరేషన్ బియ్యాన్ని ఉప్పుగల్లు చుట్టుపక్కల గ్రామాల నుంచి కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. పట్టుబడిన రేషన్ బియ్యాన్ని జఫర్‌గఢ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. కాగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వారిలో యాదాద్రి భువనగిరి జిల్లా బద్దుతండాకు చెందిన గుగ్గులోతు నర్సింహ, తేజావత్ ప్రకాశ్, మేడ్చల్ జిల్లాకు చెందిన మాలోతు సుమన్, సిద్దిపేట జిల్లాకు చెందిన కమ్మదారి నవీన్, కమ్మదారి మల్లేశ్, దేవి మహేశ్ ఉన్నారు. మిగితా నిందితులైన మూడవత్ నర్సింహ, గుగ్గులోతు రాజు, గుగులోతు రామచందర్ పరారీలో ఉన్నారు. వీరిపై కేసులు నమోదు చేసి నిందితులను కోర్టుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

నర్సంపేటలో పీడీఎస్ బియ్యం సీజ్

వరంగల్: నర్సంపేటలోని ఎక్కంటి శంకరలింగం ఇంట్లో 43 బస్తాలు సుమారు 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంను సీజ్ చేసినట్లు నర్సంపేట సివిల్ సప్లై డీటీ బి.వినోద్‌కుమార్, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రాజశేఖర్ తెలిపారు. బుధవారం అందిన పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించి రూ.52 వేల విలువైన బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై 6ఏ, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

FLAT FOR SALE

■KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్డుకి, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంటులో 2 & 3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26912]

HOUSE FOR SALE

■ఉర్సుగుట్ట నుండి ఖాజీపేట్ వెళ్ళు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన, భట్టుపల్లి SR Prime School కు ఎదురుగా 2 & 3 BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26914]

■వరంగల్, రంగశాయిపేట, శేషాద్రిహిల్స్‌లో E/F తో గల డీలక్స్ Ready to Occupy 2 BHK House అమ్మకానికి కలదు. సెల్: 7660008666, 8309035091. [WA-26916]

■ములుగురోడ్డు కాకతీయ కెనాల్ కన్నేమూల గణపతి టెంపుల్‌కి దగ్గరలో G+1 తో గల Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26918]

PLOT FOR SALE

■మామునూర్ సెంటర్లో 347 చదరపు గజాల నార్త్ ఈస్ట్ కార్నర్ ప్లాటుకై సంప్రదించవల్సిన సెల్ నెం: 9032111600. [W-785515]

■ప్రీ లాంచింగ్ ఆఫర్ ! (కేవలం రూ॥ 4,50,000/-లకే 1 గుంట) శరవేగంగా అభివృద్ధి చెందుతున్న గిర్ని బావి మేన్ రోడ్డుకు దగ్గర్లో, సెల్: 7416975767, 8978118889. [WA-515]

■GWMC - KUDA పరిధిలోని 3300 చ॥గ॥ ఏనుమాముల మార్కెట్ మేన్‌గేట్‌కి ఎదురుగా 2 సైడ్ రోడ్స్ ఫేసింగ్ భూమి అమ్మకానికి కలదు. సంప్ర॥ 9440290009, 9441689294. [W-785516]

100 PLOTS 100 GIFTS

■ Breeza కారు, 10 హీరో బైక్స్, 10 LED TV లు, 10 AC లు, 20 కూలర్లు, 20 మిక్సీలు etc. ప్లాటుకు కేవలం 2 లక్షలు మాత్రమే. సెల్: 9700518878, 9154047151 [WA-6944]

తాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com

SERVICES

■వ్యక్తిగత, వ్యాపారం, వ్యవసాయ ఆస్తి, టేక్ఓవర్ లోన్, NPA కేసులు తక్కువ సిబిల్ స్కోర్ కూడా రుణానికి వర్తిస్తాయి. సంప్రదించండి: 94630 26237. [T-1801]

■బాలాజీ గోల్డ్. మీ బంగారు బ్యాంకులో గాని ఏ ఇతర సంస్థలో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) తాకట్టు షిఫ్టింగ్ చేయబడును. 9032040019. [T-08]

■అతి తక్కువ డాక్యుమెంట్స్‌తో రుణాలు ఇవ్వబడును. వ్యక్తిగత, ప్రాపర్టీ, వ్యాపారం, వ్యవసాయం, మార్ట్‌గేజ్ రుణాలు ఇవ్వబడును. సంప్రదించండి: 7731886547. [T-20]

LOANS

■సిరి అసోసియేట్స్: హౌస్, ఫ్లాట్, ఓపెన్ ప్లాట్, ల్యాండ్, వ్యవసాయ భూమి, వ్యక్తిగత, ఏ ప్రాపర్టీ అయినా మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. సెల్: 9666142226. [W-785472]

WANTED

■ Wanted, Office Assistant Vodafone Idea Limited (Reddy Colony branch), Qly: Any Degree Salary: 7000/- Whatsapp Your Resume and Passport size Photo. Wanted Sims Sale Promoters Salary. 6000. Cont: 9160445505. [W-785483]

■ Kamalatmika Poultry is Looking for the following positions 1) Chicken Cutters, 2) Dressing People, 3) Sales Executives. Experience is mandatory in the same domain, Attractive Salary and Bonus. Cell:8106112401. [W-785482]

■ గుమాస్తాలు 5 గురు కావలెను జీతం: 9000/- పద్మావతి ఫర్నీచర్ అండర్ బ్రిడ్జి రోడ్, శివనగర్, వరంగల్ లోకల్ వారికి ప్రాధాన్యత సంప్రదించండి డైరెక్ట్‌గా షాప్ దగ్గరికి. [W-785484]

■ ప్రముఖ క్రిష్ణవేణి కాలేజ్ (HNK) లో కావలెను. వంటమాస్టర్ (M), కప్యూటర్ ఆపరేటర్ (M), వార్డెన్ (M/F), Maths, Phy, Chem, Bot, Zoology, JLS & SLS (Male), JLS, SLS అడ్మిషన్స్ compain చేయువారికి ప్రాధాన్యత. సెల్: 9849610729. [WA-6947]

■ Wanted (Full time/Part Time) Manager MS Office Fac, Multimedia Fac, Teaching Fac, Lab Instructor, Receptionist, Telecaller, Office Boy, Softech Computers, GMR Complex One shopping Mall దగ్గర Kishanpura, Hanamkonda, Resume తో వచ్చి మధుమిత Madam ని కలవండి. [W-785514]

■ ప్రముఖ ఆఫీస్ నందు పనిచేయుటకు లేడి టెలికాలర్స్ కావలెను. Qua: ఇంటర్, అడ్రస్: రంగశాయిపేట సర్కిల్, వరంగల్. సెల్: 9966984120, 7386788281. [W-785481]

■ WGL, HNK హాస్పిటల్స్, షాపింగ్ మాల్స్‌లో పనిచేయుటకు హౌస్ కీపింగ్ (స్త్రీ/పు), సెక్యూరిటీ గార్డ్స్ & సూపర్‌వైజర్స్ (స్త్రీ/పు) కావలెను. సంప్ర॥ 7670963531, 0870-3569177. [W-785513]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-785707]

■ HYDలో అర్జంటుగా సెక్యూరిటీ గార్డ్స్, RTC కార్గో బస్‌లకు బాయ్స్, అటెండర్స్ కావలెను. (కన్సల్టెన్సీ కాదు) మంచి జీతం: వసతి కలదు. సంప్ర: 040 -66366664, 9392663777, 9246663777 [HA-1330]

WANTED TEACHERS

■ Trained Teachers to teach I to X Classes for all subjects, Fluency in English is compulsory, Fusco's E/M High School, Wardhannapet, Cell: 9494130755, 9390905146. [W-785480]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/-రూ॥ అదనపు లైను 60/- రూ॥లు మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ 9010144453
వరంగల్ 9705748198
నర్సంపేట 9010144453
జనగామ 9951602871
మహబూబాబాద్ 9010144453
జయశంకర్ భూపాలపల్లి 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.